
భూమి పూజ చేస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

కాలనీ సంక్షేమ సంఘం భవనానికి భూమి పూజ

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని సాయి గణపతినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం భవనానికి గురువారం కాలనీవాసులతో కలిసి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీవాసులు కలిసి కట్టుగా ఉండి సొంత నిధులతో సంక్షేమ భవనాన్ని నిర్మించుకోవడం హర్షణీయమన్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు వెంకటేష్, బాలాజీ, లక్ష్మణస్వామి, సత్యనారాయణ, నర్సింహులు, జంగారెడ్డి, పారంద సాయి, కడారి యాదగిరి యాదవ్, సాయి రాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ సీఐగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



హయత్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సీఐ జి. రామకృష్ణ బదిలీ అయ్యారు. స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మాడ్గుల సీఐగా పని చేస్తున్న పి. నాగరాజుగౌడ్‌ను హయత్‌నగర్‌కు బదిలీ చేశారు. గురువారం సీఐ రామకృష్ణ రిలీవ్ కాగా, కొత్త సీఐగా వచ్చిన నాగరాజుగౌడ్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ, నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, రామకృష్ణ ఫిబ్రవరి 19న హయత్‌నగర్‌కు సీఐగా వచ్చారు. 6 నెలల 10 రోజులు పని చేయగానే సీపీ ఆయనపై బదిలీ వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. సీఐ సివిల్ వివాదాలలో తలదూర్చినందుకే రామకృష్ణపై బదిలీ వేటు పడినట్టు తెలుస్తోంది.

బృందావన్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ బృందావన్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో అంతర్గత దారుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని, అందుకు త్వరలో అంచనాలు సిద్ధం చేయిస్తామన్నారు. కాలనీలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. వర్షం కురిసిన ప్రతీ సారీ ఎగువ కాలనీల నుండి వరదనీరు చేరి దారులను ముంచెత్తుతోందని కాలనీవాసులు ఆయనకు విన్నవించారు. ఆగిన బాక్స్ డ్రెయిన పనులు పునరుద్ధరించాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు కొరివి శ్రీనివాస్ యాదవ్, ప్రతినిధులు రాకేష్, సతీష్ పాల్గొన్నారు.


తహసీల్దార్ ఇందిరాదేవిని కలిసిన దావూద్‌ఖాన్‌గూడ భూబాధితులు

బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ భూములను కాపాడండి

● తహసీల్దార్‌కు దావూద్‌ఖాన్‌గూడ భూబాధితుల వినతి

సరూర్‌నగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌లోని పలు సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని దావూద్‌ఖాన్‌గూడ సర్వే నంబర్ 2 భూబాధితులు బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవిని కోరారు. రెండ్రోజుల క్రితం ఇక్కడి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను గురువారం బాధిత రైతులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దావూద్‌ఖాన్‌గూడ సర్వే నంబర్ 2లోని ప్రభుత్వ భూమిని స్థానిక దళిత రైతులకే దక్కేలా చూడాలని ఆమెను కోరారు. కాగా తాను కొత్తగా వచ్చానని, సదరు భూమికి సంబంధించి సమగ్ర వివరాలు పరిశీలించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ ఇందిరాదేవి వారికి హామీ ఇచ్చారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో భూబాధితుల పోరాట సమితి ప్రతినిధులు గుడ్ల శ్రీనివాస్, కర్రె రమేశ్, ఉమాకాంత్, సురేశ్, పుట్టగల్ల శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చాదర్‌ఘాట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణేశ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సరూర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు లు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనసమర్థ ప్రాంతాలైన దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా, రాజీవ్ చౌక్, దిల్‌సుఖ్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. పలువురి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హయత్‌నగర్‌లో వాహన తనిఖీలు

హయత్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగ సందర్భంగా గురువారం వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఆధ్వర్యంలో హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ వాహన తనిఖీలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి నిషేధిత పదార్థాలు తీసుకురాకుండా ఉండేందుకు ఈ సోదాలు చేపట్టారు. హయత్‌నగర్ బస్ స్టాండ్, వ్యాపార సముదాయాలు, కాంప్లెక్స్‌లలో డాగ్ స్క్వాడ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. సీసీఎస్, ఏఆర్ పోలీసులతో కలిసి శోధించారు. ఎస్ఐ వెంకటరెడ్డి, నెహా నాయక్, లక్ష్మీనారాయణ, లింగారెడ్డి, ఎఎస్ఐ పెంటారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వనస్థలిపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను 'ప్రతిష్టిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్ట్ అధికారి బి.నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం ఎల్బీనగర్ చౌరస్తాలో తెలం గాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విభూతి బ్రదర్స్ కళాజాత బృందంచే మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టింగ్ రహిత మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కళాకారులు ఆలపించిన పలు గీతాలు ఆకట్టుకున్నాయి.

గణేశ్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

● వివిధ శాఖల అధికారులకు ఉప కమిషనర్ ఆదేశం ● వినాయక ఉత్సవ ఏర్పాట్లపై కార్పొరేటర్లు, అధికారులతో సమీక్షించిన డీసీ


సమావేశంలో పాల్గొన్న ఉపకమిషనర్ యాదయ్య, కార్పొరేటర్లు

వనస్థలిపురం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): రానున్న వినాయక చవితి సందర్భంగా నిమజ్జనానికి విస్తృత ఏర్పాటు చేయాలని ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య వివిధ శాఖ అధికారులను ఆదేశించారు. వినాయక చవితి ఏర్పాట్లపై గురువారం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయ చవితి ఉత్సవాలతో పాటు నిమజ్జన సమయంలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా రోడ్లుతో పాటు వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రోడ్డుపైకి ఉన్న చెట్ల కొమ్మలను కొట్టించి వాటిని వెంటనే తొలగించాలని అన్నారు. వినాయక మండపాలతో పాటు చెరువులు, బేబీ పాండ్‌ల వద్ద ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని ఉపకమిషనర్ అన్నారు. మండపాలు, చెరువులు, బేబీ పాండ్‌ల వద్ద యాంటీలార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేపట్టాలని ఎంటమాలజీ సిబ్బందిని ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలోను, ఊరేగింపు జరిగే ప్రాంతాల్లోను భక్తులకు తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం తగదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి సూచించారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు కొలను వద్ద గణేశ్ నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు చేయాలని, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదే విధంగా చెరువుకు అనుసంధానమైన రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడంతో పాటు చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని, విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, అరుణ సురేందర్‌యాదవ్, నవజీవ్‌రెడ్డి, ఈఈ రమేష్ బాబు, ఏసీపీ పావని, డీఈ నీలిమ, వెటర్నరీ అధికారి యాదగిరి, హార్టికల్చర్ మేనేజర్ మేధ, ఎంటమాలజీ ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, శాస్త్రవేత్త రాజ్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ గ్రూప్ ఆఫ్ టెక్నికల్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం బీటెక్ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజనీరింగ్ కోర్స్‌లో ఉన్న ఉపాధి అవకాశాలను శాస్త్రవేత్త రాజ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. డిఫెన్స్‌లో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నాణ్యత, నైపుణ్యంతో కూడిన విద్యకు అధిక ప్రాధాన్యత ఉంటుందని..ఉద్యోగ అవకాశాలు కూడా వారికే ఎక్కువగా వస్తాయన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ షేక్ రుస్తుం, డాక్టర్ నరేంద్రకుమార్, డాక్టర్ పాల్దాస్, కళాశాల డైరెక్టర్ కసిరెడ్డి రఘోత్తంరెడ్డి, ఏఓ, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జలమండలి ఓఅండ్ఎం డివిజన్-2 (బి), బాలాపూర్ రిజర్వాయర్ పరిధిలోని గుర్రం చెరువు నుంచి సన్నీ గార్డెన్స్ వరకు జీహెచ్ఎంసీ, ఎస్ఎండీపీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి ఇబ్బందులు కలగకుండా బాలాపూర్ రిజర్వాయర్ అవుట్ లెట్ 450 ఎంఎం డయా పైపు లైన్ డైవర్షన్ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు శుక్రవారం రాత్రి 9 నుంచి శనివారం రాత్రి 9 గంటల వరకు జరుగుతాయని, పైన పేర్కొన్న బాలాపూర్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో శుక్రవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



సరూర్‌నగర్ రైతుబజార్ మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చనగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోతరాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. వేడుకల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పున్న గణేష్, బండి మధుసూదన్‌రావు, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌యాదవ్, రైతుబజార్ ఈఓ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

-ఎల్బీనగర్,ఆంధ్రజ్యోతి


ఏఎస్ఓ పుల్లయ్యను సన్మానిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

సన్మానం

చంపాపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ సరూర్‌నగర్ సర్కిల్-3 ఏఎస్ఓగా పుల్లయ్య ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన బాలసరోజ బదిలీపై వెళ్లారు. గురువారం రంగారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొక్కొండ వైకుంఠంగుప్తా, రాష్ట్ర రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం మల్లికార్జునగౌడ్‌ల ఆధ్వర్యంలో డీలర్లు ఎఎస్ఓ పుల్లయ్యను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీలర్లు రమేష్‌గుప్తా, వరణ్‌గుప్తా, రాజశేఖర్‌గౌడ్, పవన్, రమేష్ ముదిరాజ్, యాదయ్యగౌడ్, బి.శాస్త్రి, గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి 'హైడ్రా'కు ఫిర్యాదు

ఎల్బీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని అక్రమ కట్టడాలను తొలగించాలని ఎల్బీనగర్ ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గం పరిధిలోని మొత్తం 16 చెరువుల్లో 80 శాతం మేర కబ్జాలకు గురయ్యాయని తెలంగాణ జనసమితి ఎల్బీనగర్ ఇన్‌చార్జి కేవీ రంగారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. సరూర్‌నగర్ హయత్‌నగర్, నాగోల్, కర్మన్‌ఘాట్, మన్సూరాబాద్ తదితర ప్రాంతాలలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జా చేసి అక్రమ కట్టడాలను చేపట్టారన్నారు. మూసీ పరీవాహ ప్రాంతంలో రెండు వైపుల అక్రమ నిర్మాణాలు చేపట్టారని వారు వివరించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమ కర్త పిండిగ వెంకన్న, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీనేత గోర శ్యాంసుందర్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, వైవీ గిరి, వెంకటేష్‌గుప్తా, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

'ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దు'

ఎల్బీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్ సేవా ఇస్లావత్ ప్రజలకు సూచించారు. గురువారం సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొందరు బాధ్యత లేకుండా చెత్తను తీసుకొచ్చి చెరువు కట్టపై వేస్తుండటంతో దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. గురువారం ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు చెరువు కట్టపై ఉండి చెత్త వేయవద్దని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

లింగోజిగూడ ఓల్డ్ విలేజ్‌లో.. లింగోజిగూడ డివిజన్‌లోని ఓల్డ్ విలేజ్‌లో ఎంటమాలజీ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలి


సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా క్షేత్రస్థాయిలో నిర్వాహకుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. గణేష్ ఉత్సవాల భద్రత ఏర్పాట్లపై నేరేడ్‌మెట్‌లోని కార్యాల యంలో గురువారం భాగ్యనగర ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గణేష్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు మండపాల వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మం డపంలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్, డీసీపీలు ప్రవీణ్ కుమార్, కరుణాకర్, అరవిందబాబు, మురళీధర్, శ్రీనివాస్, సునీతారెడ్డి, మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డుల విక్రయ ముఠా ఆటకట్టు

● ఐదుగురి అరెస్ట్, 1748 సిమ్ కార్డులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రీ యాక్టివేటెడ్ సిమ్ కార్డులు విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అబిడ్స్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి 7 మొబైల్ ఫోన్లు, 1748 సిమ్ కార్డులు, రూ.7460 నగదు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన సూరా వెంకటేష్ అలియాస్ వెంకీ (35) ప్రైవేటు ఉద్యోగి. బీటెక్ చదివిన ఇతడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. ఉద్యోగం మానేసి నిమ్మకాయల వ్యాపారం మొదలెట్టాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ప్రీ యాక్టివేటెడ్ సిమ్ కార్డుల విక్రయం ప్రారంభించాడు. కడప జిల్లా బుద్వేల్‌కు చెందిన ఎయిర్‌టెల్ డిస్ట్రిబ్యూటర్ నల్ల ఇమాంసాహెబ్‌గారి సద్దాం హుసేన్ (28) ఇతడికి సిమ్ కార్డులు ఇచ్చి సహకరిం చేవాడు. సిమ్ కార్డు కొనుగోలు కోసం వచ్చిన వారి ఆధార్ వివరాలు సేకరించిన సద్దాంహుసేన్ వాటి సాయంతో ఇంకో సిమ్‌ను యాక్టివేట్ చేసేవాడు. యాక్టివేట్ చేసిన సిమ్‌లను ఒక్కొక్కటి రూ. 1500 చొప్పున వెంకటేష్‌కు విక్రయించేవాడు. వెంకటేష్ ఈ సిమ్‌కార్డులను గూడూరుకు చెందిన దానం విజయ్ కుమాంర్, తిరుపతికి చెందిన జి. గోవర్ధన్, చెన్నైకి చెందిన బాలకృష్ణన్ మణికందన్‌లకు విక్ర యించే వాడు. ఎవరికీ అనుమానం రాకుండా సిమ్‌కార్డుల విక్రయానికి వీరు తరచు నగరానికి వస్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ అబిడ్స్ పోలీసులు వలపన్ని అరెస్ట్ చేశారు.

వైద్యరంగంలో టెక్నాలజీని విస్తరిస్తాం

●కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి


కిమ్-సన్‌షైన్ ఆస్పత్రిని సందర్శించిన మాల్దీవ్ హెల్త్‌కేర్ ప్రతినిధులతో డాక్టర్ గురవారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్య సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు వైద్యరంగంలో వస్తున్న టెక్నాలజీని విస్తరించడంపై కిమ్-సన్‌షైన్ ఆస్పత్రి దృష్టి సారిస్తుందని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి తెలిపారు. బుధవారం మాల్దీవ్ హెల్త్‌కేర్ నుంచి మాలి సిటీ గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల సీఈఓ ఇబ్రహీం అబ్దుల్ రజాక్ హలీం నేతృత్వంలో డిప్యూటీ సీఈఓ డాక్టర్ షా అబ్దుల్లా మహిర్, మహమ్మద్ ముబరూక్ తదితరుల బృందం ఆస్పత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఏఈ గురవారెడ్డి తో కలిసి వైద్య ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు తగిన సహాయ సహకారాల విషయంపై చర్చించారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి, మాల్దీవుల ఆరోగ్యం మంత్రిత్వ శాఖల మధ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం, మాల్దీవుల్లో వైద్య నైపుణ్యం, శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్ ద్వారా టెక్నాలజీని విస్తరించే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీ ఓ ఓ సుధాకర్ జాదవ్, కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఇంటర్నేషనల్ హెడ్ గోకుల్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కనే గంజాయి మొక్క!


రహదారి పక్కనే ఏపుగా పెరుగుతున్న గంజాయి మొక్క

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి అనగానే విశాఖ ఏజెన్సీ ఏరియా నుంచి వస్తుందని అందరికీ తెలుసు. కానీ హయత్‌నగర్‌లో విజయవాడ జాతీ య రహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డు పక్కనే ఓ గంజాయి మొక్కగా ఏపుగా పెరుగుతోంది. ఎవరు పెట్టారో తెలియదు కానీ మొక్క మా త్రం పెరిగి పెద్దది అయింది. రాఘవేంద్రనగర్ కాలనీలోనికి వెళ్లే రోడ్డు మూల మలుపు వద్ద ఆముదం చెట్ల గుంపులో గంజాయి మొక్కను గుర్తించిన ఓ వ్యక్తి చెప్పడంతో 'ఆంధ్రజ్యోతి' ఫొటో తీసింది. మొక్క ఇక్కడ పెరగడాన్ని బట్టి చూస్తే ఈ ప్రాం తంలో గంజాయి తాగేవారు ఉండి ఉంటారని స్థానికులంటున్నారు.


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్, రవి

బాలాపూర్‌లోని చెరువులను కాపాడండి

సరూర్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని పలు చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, పాత పంచాయతీ లేఅవుట్లు, అనుమతులు సృష్టించి అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారని స్థానికులు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవిలను కలిసి ఫిర్యాదు చేశారు. సదరు ఆక్రమణలపై చర్యలు తీసుకుని చెరువులను సంరక్షించాలని కోరారు. ఈ మేరకు గురువారం సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, ఎంఆర్‌పీఎస్ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవిమాదిగ, సుధాకర్, చందు తదితరులు ఎమ్మెల్యే, తహసీల్దార్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలాపూర్‌లోని ఈసనాసన్‌కుంట, ఫిరంగినాలాతో పాటు పెద్దచెరువు, కొంతమోనికుంట తదితర చెరువులను కొందరు తమ రాజకీయ పలుకుబడితో కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి అమాయకులకు విక్రయిస్తున్నారన్నారు. అధికారుల నుంచి వివరాలు తెప్పించుకున్న తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని సబితారెడ్డి వారికి హామీ ఇచ్చారు.

నేడు సంతోషిమాత గుడిలో గాజుల పూజ

చాదర్‌ఘాట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం నేపథ్యంలో నేడు దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసంతోషిమాత, శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో గాజుల పూజా కా ర్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేశారు. 306 మంది మహిళలు గాజుల పూజలో పాల్గొనున్నారు.

కాలనీ సమస్యలను సత్వరం పరిష్కరిస్తా..


పైప్‌లైన్‌కు మరమ్మతు చేయిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం, ఆగస్టు29(ఆంధ్ర జ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం గుంటి జంగయ్యనగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు నిర్వహిస్తుండగా తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయిందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఆయన పైప్‌లైన్ పగిలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పింక్ బాల్ కోర్టు నిర్మాణ పనులు ప్రారంభం

సైదాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినయ్‌నగర్ పార్కులో పింక్ బాల్ కోర్టు నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేతామదుకర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ప్రజలకు ఆహ్లాదకరంగా పార్కులు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే లక్ష్మీనగర్ కాలనీ, ప్రెస్ కాలనీలలో ఒపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్య క్రమంలో భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి, అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేషుబాబు పాల్గొన్నారు.

నేషనల్ స్పోర్ట్స్ డే..

హయత్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని సిటీ మోడల్ పాఠశాల విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేత భూమి హయత్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. సూర్యానగర్ మీదుగా వీరభద్రనగర్ కాలనీ నుంచి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపల్ వెంకట్, మార్షల్ ఆర్ట్ నరేందర్, పీఈటీ నర్సింగ్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక లారీల యజమానుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇసుక లారీల యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఇసుక లారీల యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ శ్రీనివాస్ రెడ్డికి నియామక పత్రం అందజేసి ఉత్తర్వులు జారీ చేశారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించాలి

వనస్థలిపురం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధులు రాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (శానిటేషన్) రఘుప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం నాగోల్, మన్సూరాబాద్ డివిజన్‌లలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ఎలా ఏర్పడుతున్నాయి, వాటి యొక్క ఎలిమినేషన్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, మహమూద్ షేక్ (ఎస్.డబ్ల్యూ.ఎం), డీఈ (ఎస్.డబ్ల్యూఎం) నీలిమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు రాంకీ ప్రతినిదులు పాల్గొన్నారు.